సాక్షి చిత్తూరు

ఆదివారం । 24 । మార్చి । 2024



మేము సైతం!

గ్రామ వలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. జగనన్న కోసం ఎంత చేసినా తక్కువేనంటున్నారు. - IIలో



చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు

శ్రీరంగరాజపురం మండలంలో ప్రైవేట్ స్కూల్ బస్సు చెట్టును ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. - IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సా)	సహర్ సోమవారం (ఉ)
చిత్తూరు	6.29	4.54
పుంగనూరు	6.31	4.57

న్యూస్‌రీల్

624 లైసెన్స్‌డు తుపాకులు స్వాధీనం

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 624 లైసెన్స్‌డు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్టు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. లైసెన్స్‌డు తుపాకులను స్వాధీనం చేసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాలు జారీ చేశారు. బ్యాంకుల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, ఏటీఎం కేంద్రాలకు నగదు తీసుకెళ్లే సెక్యూరిటీ ఏజెన్సీలు, క్రీడా ఈవెంట్ల నిమిత్తం తుపాకులు వినియోగించే వారు మినహా ఇతరుల నుంచి లైసెన్స్‌డు తుపాకులను అధికారులు డిపాజిట్ చేయించారు. జిల్లాలో 697 లైసెన్స్‌డు తుపాకులు ఉండగా 624 తుపాకులను పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయించారు. మిగిలిన 73 తుపాకులకు నిబంధనల మేరకు మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు. వాటిని కోడ్ ముగిసిన తర్వాత సంబంధిత వ్యక్తులకు తిరిగి ఇవ్వనున్నారు. ఇవి కాకుండా ఎక్కడైనా ప్రైవేట్ వ్యక్తుల వద్ద తుపాకులు ఉంటే ఎస్పీకి అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లుల చెల్లింపు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆది, సోమవారాల్లో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ రెండు రోజులు ప్రభుత్వ సెలవు దినాలైనప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేస్తాయని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు కుప్పానికి చంద్రబాబు రాక

సాక్షి, చిత్తూరు: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 25, 26 తేదీల్లో కుప్పంలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తొలి రోజు కుప్పం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బహిరంగ సభలో పాల్గొంటారు. రెండో రోజు రామకుప్పం మండలంలోని హంద్రీ–నీవా ప్రాజెక్టులో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను పరిశీలించనున్నారు.

వారిని గుర్తించండి

పలమనేరు : 'ఈ నెల 27న పలమనేరులో చంద్రబాబు ప్రజాగళం సభ జరుగుతుంది. మన కుటుంబ సభ్యులే మూడువేల మంది దాకా ఉన్నారు.. నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి సభకు తీసుకురండి' అని మాజీ మంత్రి అమర్‌నాథరెడ్డి టీడీపీ నేతలకు హుకుం జారీచేశారు. చంద్రబాబు పలమనేరు పర్యటన నేపథ్యంలో ఆయన శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నేతలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పథకాలు అందని వారితో అర్జీలు రాయించి సభలో ఏర్పాటుచేసే సమస్యల పెట్టెలో వేయించాలన్నారు. వాటిలో కొన్నింటిని చంద్రబాబు చదివి వినిపించి అర్జీదారులతో మాట్లాడిస్తారని పేర్కొన్నారు. తద్వారా ఈ ప్రభుత్వాన్ని ఎండగట్టాలన్నదే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లోనే అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని ప్రజలకు చెప్పాలని వివరించారు. ఇదిలా ఉండగా అందరికీ పథకాలు అందాయని, రాని వారిని ఎక్కడ వెతికేది అమరన్నో అంటూ టీడీపీ నేతలు ఆలోచనలో పడ్డారు. ఏది ఏమైనా చంద్రబాబు ప్రజాగళం సభకు జన సమీకరణ చేయడం టీడీపీ నాయకులకు సవాల్‌గా మారింది.


తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఆయన శనివారం క్షేత్రస్థాయి అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా నీటి ఎద్దడి ఉంటే వెంటనే పరిశీలించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. చెరువులు, గ్రామీణ ప్రాంతాల్లోని నీటి వనరులను పరిశీలించాలన్నారు. నెలరోజుల వరకు చేపట్టాల్సిన చర్య ల నివేదికలు పంపాలని చెప్పారు. ఎక్కడైనా రిపేర్లు చేపట్టాల్సి ఉంటే అంచనాలు రూపొందించాలన్నారు. తాగునీటికి ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. జిల్లాలో ఉన్న 4,122 మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో నీటి నిల్వలపై ఆరా తీశారు. కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ గ్లోరియా, డీపీఓ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామయ్య, ఇరిగేషన్ ఈఈ నాగభూషణం పాల్గొన్నారు.

కోడ్ కట్టుదిట్టం

జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అభ్యర్థులు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి మోడల్ కోడ్ అమలులో ఉంది. ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే నేరుగా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. లేదా ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సీ–విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి పంపవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు, ముఖ్యాంశాలపై 'సాక్షి' కథనం.

- ప్రజల మధ్య విద్వేషాలు పెంచేలా వ్యవహరించరాదు
- కుల, మతాల పేరుతో ఓట్లు అడగరాదు
- ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రచారానికి నో
- ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలు వద్దు



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అధికార యంత్రాంగం పకడ్బందీగా అమలు చేస్తోంది. ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో తిరుగుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్నాయి. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్, చిత్తూరు ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పర్యవేక్షిస్తున్నారు.

కోడ్ నియామవళి..

- కుల, మత, భాష వర్గాల ప్రజల మధ్య విభేదాలు పెంపొందించే లేదా ఉద్రిక్తతలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదు.
- ప్రత్యర్థి పార్టీలపై చేసే విమర్శలు ఆ పార్టీ విధానాలు, కార్యక్రమాలు, గతంలో చేసిన పనులకు పరిమితమై ఉండాలి.
- వ్యక్తిగత విమర్శలు చేయరాదు. ధ్రువీకరణ కాని ఆరోపణలు, వక్రీకరణల ఆధారంగా విమర్శలు చేయరాదు. అసత్య ప్రచారాలు, వ్యక్తిగత విమర్శలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టరాదు.
- ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రచారం చేయకూడదు.
- కుల, మతాల పేరుతో ఓట్లు అడగకూడదు. ప్రజల మధ్య విద్వేషాలు పెంచేలా వ్యవహరించకూడదు. ఓటర్లను ప్రలోభాలు, బెదిరింపులకు గురిచేయకూడదు.
- ఆధారాల్లేకుండా రూ.50 వేలకు మించి నగదును తరలించకూడదు.
- ఓటరు స్థానంలో ఇతరులతో ఓటు వేయించడం, పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ప్రచారం చేయడం, పోలింగుకు 48 గంటల ముందు సభలు సమావేశాలు నిర్వహించడం, ఓటర్లను పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పించడం వంటివి చేయరాదు.
- ప్రతి పౌరుడూ తన ఇంట్లో ప్రశాంతంగా బతికే హక్కును గౌరవించాలి. వ్యక్తుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా వారి ఇళ్లముందు నిరసనలు, ప్రదర్శనలు, ఆందోళనలు చేపట్టరాదు.
- యజమానుల అనుమతి లేకుండా వారి స్థలాలు, భవనాలు, ప్రహరీ గోడలకు జెండాలు, బ్యానర్లు కట్టడం, పోస్టర్లు అంటించడం, వాల్ రైటింగ్స్ లాంటివి చేయరాదు.
- ఒక పార్టీ అతికించిన పోస్టర్లను తొలగించకూడదు..
- ఇతర పార్టీల సమావేశాలు, ఊరేగింపులకు తమ మద్దతుదారులు భంగం కలిగించకుండా చూసుకోవాలి. ఏదైనా ఒక పార్టీ కార్యకర్తలు వేరే పార్టీల సమావేశం జరుగుతున్న ప్రాంతం మీదుగా ఊరేగింపు నిర్వహించకూడదు.
- ఊరేగింపు రూట్‌మ్యాప్‌ను ముందుగా పోలీసులకు తెలియజేయాలి. ఇద్దరు, అంతకు మించి అభ్యర్థులు, పార్టీలు ఏకకాలంలో ఒకేరూట్లో ఊరేగింపు నిర్వహిస్తే ఘర్షణ వాతావరణం లేకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలి.
- ఊరేగింపులో తీసుకెళ్లే వస్తువుల విషయంలో అభ్యర్థులు నియంత్రణ పాటించాలి. అవి అసాంఘిక శక్తుల చేతిలో దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇతర పార్టీల నేతల దిష్టి బొమ్మలను ఊరేగించడం, బహిరంగంగా దహనం చేయడం వంటివి చేయరాదు.
- ఓటర్లు మినహా ఇతరులు పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించేందుకు అనుమతి ఉండదు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన పాస్ ఉన్న వారికి మాత్రం మినహాయింపు ఉంటుంది.

నిషేధాజ్ఞలు కచ్చితంగా పాటించాలి..



- శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతిపాదిత సభ సమయం, వేదిక వివరాలను ముందుగా స్థానిక పోలీసులకు తెలపాలి. సభ ఉన్న ప్రాంతంలో నిషేధాజ్ఞలను కచ్చితంగా పాటించాలి. అవసరమైతే ముందుగానే దరఖాస్తు చేసుకుని సడలింపులు పొందాలి. సభలో లౌడ్ స్పీకర్, ఇతర సదుపాయాల కోసం అనుమతి తీసుకోవాలి.
- అభ్యర్థుల స్పీచ్‌లు ఓటు వేసేలా ఉండకూడదు. స్వేచ్ఛగా ఓటు వేసేలా ఎన్నికల అధికారులకు సహకరించాలి.
- ఓటర్లకు పంపిణీ చేసే చిట్టీలపై గుర్తులు, పార్టీల పేర్లు ఉండరాదు.
- పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి మద్యం పంపిణీ చేయరాదు. పోలింగ్ బూత్ వద్ద పార్టీలు, అభ్యర్థులు ఏర్పాటు చేసే క్యాంపుల వద్ద పోస్టర్లు, జెండాలు, గుర్తులు తదితర ప్రచార సామగ్రిని ప్రదర్శించరాదు. ఆహార పదార్థాలు పంపిణీ చేయరాదు.
- పోలింగ్ రోజు వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉంటాయి. పర్మిట్లు పొందిన వాటికి స్టిక్కర్లను కనిపించేలా అతికించాలి. ఎన్నికల నియమావళిని ఎవరు ఉల్లంఘించినా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసే హక్కు ప్రతి భారతీయుడికీ ఉంది.

పకడ్బందీగా మోడల్ కోడ్ అమలు



"జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ వచ్చిన రోజు నుంచి మోడల్ కోడ్ అమలులో ఉంది. కోడ్‌ను క్షేత్రస్థాయిలో కట్టుదిట్టంగా అమలు చేస్తున్నాం. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ప్రజల మధ్య విభేదాలు పెంపొందించడం, ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం తదితర చర్యలకు పాల్పడరాదు. ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేయకూడదు.

– షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

నిబంధనలు అతిక్రమిస్తే శిక్షార్హులే..



కోడ్‌ను అతిక్రమిస్తే ఎంతటివారైనా శిక్షార్హులే. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదు. ఆలయాలు, మసీదులు, ప్రార్థనా స్థలాల్లో ప్రచారం చేయకూడదు. ఓటింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం ఆపివేయాలి. సమావేశాల సమాచారాన్ని ముందుగా పోలీసులకు ఇవ్వాలి. లౌడ్ స్పీకర్ల వినియోగానికి అనుమతి పొందాలి.

– శ్రీనివాసులు, అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, చిత్తూరు

సమన్వయం.. సిద్ధం



ఎన్నికలకు సిద్ధమని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రకటించారు. తిరుపతిలో శనివారం జరిగిన సమన్వయ సమావేశంలో రీజనల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి వారికి దిశా నిర్దేశం చేశారు. వచ్చే నెల 2న పీలేరు, 3, 4 తేదీల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సిద్ధం సభలు ఉంటాయన్నారు. అందులో చిత్తూరు లేదా పూతలపట్టులో ఒకటి, నాయుడుపేట లేదా శ్రీకాళహస్తిలో మరొకటి నిర్వహిస్తామన్నారు. మంత్రి ఆర్‌కే.రోజా, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, భరత్, ఎంపీలు గురుమూర్తి, రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వెంకటేగౌడ్, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, అభ్యర్థులు విజయానందరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, రాజేష్, కృపాలక్ష్మి పాల్గొన్నారు. – సాక్షి, తిరుపతి

రూ.50 వేలు మించితే వివరణ ఇవ్వాల్సిందే

చిత్తూరు కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే ఎన్నికల నిబంధనల మేరకు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది, ఎలా వచ్చింది, ఎక్కడికి తీసుకువెళ్తున్నారు తదితర వివరాలను అధికారులకు వెల్లడించాలి. సమాధానంలో తేడా ఉన్నా, అవాస్తవమని భావించినా అధికారులు నగదును స్వాధీనం చేసుకుంటారు. సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించాకే అప్పగిస్తారు. అప్పటి వరకూ ఆ నగదును కస్టడీలో ఉంచుతారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేంత వరకూ ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. అనుమానం వస్తే నగదు మాత్రమే కాకుండా బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను కూడా అధికారులు స్వాధీనం చేసుకుంటారు. వ్యాపారులు తగిన పత్రాలను దగ్గర ఉంచుకుని ప్రయాణం సాగించాలి. అనుమతి లేకపోతే మద్యం, ఆయుధాలు, ఇతర విలువైన సామగ్రిని కూడా స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ సీనియర్ నాయకుడు



బాబురెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: వైఎస్సార్ సీపీ సిద్ధమన్న నినాదంతో సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధమైంది. ఈ క్రమంలో పలువురు టీడీపీ నాయకులు మీతో నడవడానికి మేము సిద్ధం అంటూ పార్టీలో చేరుతున్నారు. వడమాలపేట మండలం కాయం పంచాయతీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కె.బాబురెడ్డి శనివారం మంత్రి ఆర్కే రోజా సమక్షంలో పార్టీలో చేరారు. ఆమె ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బాబురెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, నగరిలో మంత్రి రోజా చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు తెలిపారు. మంత్రి రోజా పార్టీలకు అతీతంగా పనిచేశారని, ప్రతిపక్ష నాయకులను వేధించిన దాఖలాలు లేవన్నారు. కోవిడ్ సమయంలో ఆమె చేసిన సేవలు తనను ఎంతగానో ఆకర్షించాయని వివరించారు. తనతో పాటు తన అనుచర వర్గం మంత్రి రోజా గెలుపునకు కృషి చేయడానికి సిద్ధమని ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్‌రెడ్డి, చంద్రారెడ్డి, గాంధీ పాల్గొన్నారు.

టీడీపీ నేతకు డిప్యూటీ సీఎం పరామర్శ



టీడీపీ నేత శేఖర్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు శేఖర్‌ను డిప్యూటీ సీఎం నారాయణస్వామి శనివారం పరామర్శించి మానవత్వం చాటుకున్నారు. ఆయన మాట్లాడుతూ తాము ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్నామని తెలిపారు. ఎన్నికల వరకే పార్టీలు, రాజకీయాలు అని పేర్కొన్నారు. అధైర్య పడొద్దని శేఖర్‌కు సూచించారు. ముఖ్యమంత్రి జగనన్న పార్టీలకు అతీతంగా పనిచేస్తున్నారని, కష్టంలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని పేర్కొన్నారు. సీఎంసీ వైద్యులకు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రత్యర్థి పార్టీకి చెందిన వ్యక్తి అయినా ఇంటికి వచ్చి పరామర్శించి ధైర్యం చెప్పడంపై డిప్యూటీ సీఎం నారాయణస్వామిని శేఖర్ కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.

నేత్ర పర్వం.. తెప్పోత్సవం



తిరుమల శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. మంగళవాయిద్యాలు, వేద పండితుల వేదపారాయణం, కళాకారుల సంకీర్తనల మధ్య తెప్పోత్సవం నేత్ర పర్వంగా సాగింది.

– తిరుమల

వైభవంగా రథోత్సవం



రథంపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగుతున్న కామాక్షి సమేత కరకంఠేశ్వరుడు

నగరి : పట్టణంలో వెలసిన కామాక్షి సమేత కరకంఠేశ్వర స్వామి ఆలయంలో పంగుణోత్తర కల్యాణ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 7వ రోజైన శనివారం రథోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రథాన్ని లాగారు. రథంపై కొలువైన కామాక్షి సమేత కరకంఠేశ్వర స్వామి దేదీప్యమానంగా వెలుగొందుతూ మాడవీధుల్లో ఊరేగారు. స్వామి, అమ్మవార్లకు భక్తులు ప్రతి ఇంటి వద్దా కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. కిక్కిరిసిన జనం నడుమ రథం ఊరేగింపు మూడు గంటల పాటు సాగింది. మంగళవాయిద్యాలు, శివ పురాణ పఠనం ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయంలో భారీ అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో రథం విరాళదాతలు కోనేరు అమృతమ్మ, సుబ్రమణ్య మొదలియార్, ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, మొదలియార్ సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

ఇందుమూలముగా యావన్మంది తిరుపతి ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా! మా కక్షిదారులైన 1) S. సంపూర్ణమ్మ, W/o.Late S.రామక్రిష్ణమనాయుడు, 2). చారుమతి దేవి, W/o. క్రిష్ణమనాయుడు వీరికి GPA Holder Naveen వీర్లకు సంబంధించిన ఈ క్రింద కనపరచిన షెడ్యూల్ దాఖలా భూములకు సంబంధించి కాముని గుంట గా యుండి ప్రస్తుతం బైరాగిపట్టెడ రెసిడెన్షియల్ ఏరియాలో సర్వే నెం. 242/బిలో మొత్తం విస్తీర్ణం ఎ.9-82 సెంట్లులో విస్తీర్ణం ఎ.4-60 సెంట్లు గురించి 21-03-2024 మరియు 22-03-2024 తేదీలలో ఈనాడు దిన పత్రికలో "స్వామి హాథీరాంజీ మఠం" ఫెట్ పర్సన్ రమేష్ నాయుడు ఇచ్చిన తప్పుడు సమాచారం మేరకు మరియు సదరు పేపరు వారికి ఉన్న అవగాహన మేరకు ఊహించిన కథనాలు ప్రచురితమయ్యాయి. అది ఏమంటే, సర్వే నెం. 242/బి కాముని గుంట భూమి హాథీరాంజీ మఠం వారికి సంబంధించినదని, దీనిని 2015లో పెద్ద రంగయ్య, చిన్న రంగయ్య అను వారు మఠం నుంచి లీజుకు తీసుకొన్నారని దానిని నిభంధనలకు వ్యతిరేకంగా 'నవీన్' అనే వ్యక్తితో చేతి పెద్ద పెద్ద భవనాలు నిర్మిస్తూ వాటిని రియల్ ఎస్టేట్ భూములుగా మార్చేసారని, వీటిలో చాలా మంది రాజకీయ మరియు పోలీసు డిపార్ట్‌మెంట్ వ్యక్తులు ప్రమేయం వుందని, సదరు భూములపై కోర్టువారు స్టేటస్‌కో ఉత్తర్వులు ఇచ్చివున్నా కూడా, వాటిని లెక్కచేయకుండా కట్టడాలు అక్రమంగా చేపడుతున్నారని, అది గమనించిన మఠం అధికారులు తెలుసుకొని, వారి సిబ్బంది అయిన మధు, కిరణ్ లు ఫోటోలు తీసేందుకు వెళ్లగా ఆ సమయంలో నవీన్ మరియు మరో ఇద్దరు కలిసి పై తెల్పిన సిబ్బందిని ఒక గదిలో వేసి దారుణంగా కొట్టి, వారి చేతిలో బలవంతంగా డబ్బులు పెట్టి పోటోలు తీసి, మీరు మా నుంచి లంచం తీసుకున్నారని ఆ విధంగా అధికారులకు రిపోర్టు చేస్తామన్నట్లుగా బెదిరించి తరిమారని ఈ విషయం తెలుసుకున్న ఫెట్ పర్సన్ రమేష్ నాయుడు, నవీన్ మరియు అతని అనుచరులపైన తగు చర్యలకు, జిల్లా కలెక్టర్, యస్.పి. దేవాదాయ శాఖ కమీషనర్కు ఫిర్యాదు చేసారని, మొత్తానికి సదరు భూమి మఠం వారికి సంబంధించిన భూమి అని ప్రజలను నమ్మించే విధంగా పై తెలిపిన రెండు రోజులు పత్రికలో ప్రచురించడమైనది.

పేపర్లో వచ్చిన కథనాలను/ఆరోపణలను ఖండిస్తూ, దానికి మా క్లయింట్స్ తరుపున వివరణ ఏమిటంటే:-

1908వ సంవత్సరంలో హాథీరాంజీ మఠం తరుపున మహంతు ప్రయాగాదాస్ జీ, సర్వే నెం. 242/బిలో విస్తీర్ణం 4-60 సెంట్లు భూమిని మీగడ గోపాలయ్యకు శుద్ధ విక్రయం చేసినారు. తరువాత 1936వ సంవత్సరంలో సదరు మీగడ గోపాలయ్య సంద్ర మునస్వామి నాయుడుకు సదరు భూమిని అమ్మివేసినారు, తదుపరి సదరు సంద్ర మునస్వామి నాయుడు ఈ భూమిపై తన కుమారుడైన సంద్ర రామక్రిష్ణమనాయుడు గారి పేరిట 1959వ సంవత్సరంలో వీలునామాను రిజిష్టరు చేయించియిచ్చినారు. సదరు సంద్ర మునస్వామినాయుడు మరణించిన పిదప, పై తెలిపిన వీలునామా ద్వారా సంద్ర రామక్రిష్ణమనాయుడు కు సంక్రమించి, సదరు రామక్రిష్ణమనాయుడు సర్వ హక్కులతో అనుభవించుకొనుచూ ఉండి, సదరు సంద్ర రామక్రిష్ణమనాయుడు గారు 16-11-2022వ తేదీన మరణించినారు. అతను మరణించిన పిదప, అతని కుటుంబ సభ్యులైన యస్. సంపూర్ణమ్మ (భార్య) మరియు పి.చారుమతి దేవి (కుమార్తె)లకు వారసత్వ రీత్యా సంక్రమించి, సర్వహక్కులతో అనుభవించుకొనుచూ పై తెలిపిన భూమిలో సంపూర్ణమ్మ మరియు పి. చారుమతి దేవిలు కలిసి, గౌరవ Andhra Pradesh High Courtలో Writ Petition వేసియున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ డిపార్టుమెంటు మరియు ఇతర అధికారులను పై W.P.ని నమోదు చేసి, సదరు భూములను రిజిష్ట్రేషన్స్‌కు అనుమతిని ఇవ్వవలసినదిగా కేసును వేయడమైనది. ఈ షెడ్యూలు దాఖలా భూములు రిజిష్ట్రేషన్ చేసుకునేందుకు 01-02-2022వ తేదీన Govt. of A.P. Memo No. REV. 01 - REG-SOCIRC (CCHC) / 825/2022 - REGN-1 ద్వారా ఉత్తర్వులు ఇచ్చియున్నారు. తరువాత సదరు భూమికి సంబంధించిన వ్యవహారాలను చూసుకొనేందుకు వీలుగా చట్టప్రకారం నవీన్ అనే వ్యక్తికి 2023వ సంవత్సరంలో రిజిష్టరు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దీడును నవీన్ పేరిట రిజిష్టరు చేసియివ్వడమైనది. సదరు జి.పి.ఏ. ప్రకారం కొన్ని ప్లాటు జాగాలను ఇతరులకు విక్రయించినారు. కొనుగోలు చేసిన వ్యక్తులు వారి వారి ఇంటి జాగాలను అనుభవించుకొనుచున్నారు.

పైన వివరించిన ప్రకారం మరొక్క సారి మా కక్షిదారులు తరుపున తెలియజేయడం ఏమనగా, తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి గ్రామ లెక్కదాఖలా, కామునిగుంటగా యుండి ప్రస్తుతం బైరాగిపట్టెడ రెసిడెన్షియల్ ఏరియా సర్వే నెం. 242/బిలో విస్తీర్ణం ఎ.4-60 సెంట్లు భూమిపై "స్వామి హాథీరాంజీ మఠం" భూమి ఎంతమాత్రమూ కాదు. ఈ భూమి పూర్తిగా ప్రైవేటు భూమి. హాథీరాంజీ మఠం వారికి, పెద్ద రంగయ్య మరియు చిన్నరంగయ్యలకు ఉన్న వ్యవహారాలకు మా క్లయింటుకు ఎలాంటి సంబంధం లేదు. 1908లో మఠం వారు అమ్మివేసిన భూమిని, లీజుకు ఇచ్చినారని చెప్పడం, పై తెలిపిన హక్కుదారులను ఆక్రమణదారులు అని అనడం, దీనిని అన్యాక్రాంతం చేసినారని చెప్పడం, ఏదో విధంగా కోట్లు విలువ చేసే భూములను మఠం వారే దౌర్జన్యం చేసి, ఆక్రమించాలని చూడడం చట్టరీత్యా నేరము, లీగల్ ఒపీనియన్ తీసుకోవకనే సదరు న్యూస్ పేపర్ వారు తప్పుడు న్యూస్ ను కవరేజ్ చేసి, ప్రజలను తప్పు త్రోవ పట్టించడమే కాకుండా, కోర్టు ప్రాసెస్‌ను కూడా అబ్యూస్ చేయడం, ల్యాండ్ కొనాలని వచ్చే కొనుగోలుదారులను కొననీయకుండా భయభ్రాంతులకు గురిచేయడం, తద్వారా ల్యాండ్ యజమానులకు ఆర్థికంగా, సామాజికంగా నష్టము కలిగించడంపై, ఈనాడు సంస్థపైన, మఠం అధికారులపైన తగు రీత్యా సివిల్ క్రిమినల్ చర్యలు తీసుకొంటామని మా క్లయింట్స్ తరుపున తెలుపుతూ, సర్వే నెం. 242/బి విస్తీర్ణం ఎ. 4-60 సెంట్లు భూమి ప్రైవేటు భూమి అని మరొక్క సారి తెలియజేస్తూ, హాథీరాంజీ మఠం వారికి భూమికి గాని, సదరు పెద్ద రంగయ్య, చిన్న రంగయ్యలకు గాని ఈ షెడ్యూలు దాఖలా భూమికి గాని ఎలాంటి సంబంధం లేదని తెలియజేయడం జరిగింది.

షెడ్యూలు : చిత్తూరు జిల్లా, తిరుపతి సబ్.డి., చంద్రగిరి తాలూకా నెం. 29 తిరుపతి గ్రామ లెక్కదాఖలా కామునిగుంటలో T.D. No. 2931, S.No. 242/B లో విక్రయ విస్తీర్ణం ఎ.4-60 సెంట్లు భూమికి హద్దులు, తూర్పు : అవిలాల గ్రామ లెక్కదాఖలా సర్వే నెం. 148లోని మఠం భూమి, పడమర : అవిలాల గ్రామ లెక్కదాఖలా సర్వే నెం. 242/బిలో మఠం వారు నిలుపుకున్న భూములు, ఉత్తరం : పెద్ద చెరువు క్రింద పట్టెడతోట, దక్షిణం : తిరుపతి పెద్ద చెరువు కలుజు కాలువ ఈ మధ్య విస్తీర్ణం ఎ.4-60 సెంట్లు భూమి యావత్తు పూరా.

PARITALA SYAM KUMAR, B.Com., B.L.,
K. JAYACHANDRA RAJU, M.A., B.L.,
ADVOCATES
2nd Cross, Royal Nagar,R.C. Road, Tirupati. **Cell: 9440799637**

మేము సైతం!

- జగనన్న కోసం పోరాటం చేస్తామంటున్న గ్రామ వలంటీర్లు
- రాజీనామా చేసి ఎన్నికల ప్రచారం చేస్తున్న వైనం

గుడుపల్లె: చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ దూసుకుపోతోంది. పలువురు స్వచ్ఛందంగా ముందుకొచ్చి బాబును సాగనంపేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే మూడు రోజుల క్రితం మండలంలోని కుప్పిగానిపల్లె పంచాయతీకి చెందిన 14 మంది వలంటీర్లు రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొన్నారు. తమ పరిధిలోని కుటుంబాలకు వెళ్లి వారు పొందిన లబ్ధిని, పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా భరత్‌ను, ఎంపీగా రెడ్డెప్పను గెలిపించాలని కోరారు. శనివారం నుంచి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఒంటిపల్లె, సిరిగిరిపల్లె, కోటచెంబగిరి గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ జగనన్న పేదలకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. వారి వెంట సర్పంచ్ రామమూర్తి, ఎంపీటీసీ వెంకటేష్, వెంకటాచలం ఉన్నారు.

హైస్కూల్ వాచ్‌మన్ రాజీనామా

కుప్పం: పట్టణంలోని అర్బన్ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న పృథ్వీరాజ్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌ను గెలిపించుకునేందుకు తన ఉద్యోగానికి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని శనివారం ఎంపీడీవో మహబూబ్ బాషాకు అందజేశారు. మున్సిపల్ కౌన్సిలర్ మోహన్‌రాం తదితరులు పాల్గొన్నారు.



కుప్పం: ఎంపీడీపీవోకు రాజీనామా పత్రం అందజేస్తున్న వాచ్‌మన్ పృథ్వీరాజ్

జగనన్న సేవలే ముద్దు

కార్వేటినగరం: వలంటీర్ పోస్టుల కన్నా సీఎం జగనన్న విజయం కోసం చేసే సేవలే తమకు ముద్దు అని వలంటీర్లు రఫీ, మహేష్ తెలిపారు. వారు శనివారం వలంటీర్ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. వారు మాట్లాడుతూ పేదరికంతో ఇబ్బంది పడుతున్న తమ లాంటి నిరుద్యోగ యువతీ యువకులకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ ఉద్యోగాలు ఇచ్చి ఆదరించారని తెలిపారు. తమ కుటుంబాల్లో వెలుగులు నింపిన జగనన్న విజయం కోసం ఉద్యోగాలను త్యజించి సైనికుల్లా పనిచేయడానికి సిద్ధపడినట్టు తెలిపారు. నిత్యం పేదల ఉన్నతి కోసం తపించే ముఖ్యమంత్రి కోసం ఎంత చేసినా తక్కువేనని పేర్కొన్నారు. పేదలు, పెత్తందార్లకు మధ్య జరిగే ఈ ఎన్నికల్లో జగనన్న విజయం కోసం పోరాటం చేయడానికి ప్రతి వలంటీరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమ పోరాటం, పయనం ఎప్పటికీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనేనని స్పష్టం చేశారు. అనంతరం రాజీనామా లేఖలను ఆయా సచివాలయంలోని కార్యదర్శులకు అందజేశారు.



రఫీ, కార్వేటినగరం వలంటీర్



మహేష్, కన్నికాపురం వలంటీర్

చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు

శ్రీరంగరాజపురం : మండలంలోని ముద్దుకుప్పంలో శనివారం ప్రైవేట్ స్కూల్ బస్సు కొబ్బరి చెట్టును ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు మండలంలో ని నెలవాయి గ్రామం వద్దనున్న ఒక ప్రైవేట్ స్కూ ల్ బస్సు శనివారం సాయంత్రం విద్యార్థులను ఇళ్ల వద్ద దింపడానికి బయలుదేరింది. ముద్దుకుప్పంలో అదుపుతప్పి కొబ్బరి చెట్టును ఢీకొంది. దీంతో అందులో ఉన్న ఇద్దరు విద్యార్థులు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనుభవం లేని డ్రైవర్ వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు.

ఆర్య వర్క్, ఫ్యాబ్రిక్ పెయింట్‌పై శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు ఉచితంగా మహిళలకు ఆర్యవర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి. సురేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. కనీసం 8వ తరగతి చదివి ఉండాలని చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థ కార్యాలయానికి వచ్చి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి.79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద శుక్రవారం సుధాకర్ (42) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ షేక్‌షావలి కథనం మేరకు.. గంగాధరనెల్లూరు మండలం పాచిగుంటకు చెందిన లారీ డ్రైవర్ సుధాకర్ శుక్రవారం యజమాని నాగరాజు ఆదేశాల మేరకు సరుకులు తీసుకుని చిత్తూరులోని ఎస్టేట్‌లో అన్‌లోడ్ చేసి అక్కడే నిద్రించాడు. యజమాని లేపినా లేవలేదు. దీంతో దూరపు బంధువైన ఆటో డ్రైవర్ రఘుకు ఫోన్ చేసి ఇంటి వద్ద వదిలిపెట్టాలని చెప్పాడు. ఇంటికి తీసుకెళ్లినా స్పృహలోకి రాకపోవడంతో స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సుధాకర్‌ను లారీ యజమాని నాగరాజు, ఆటో డ్రైవర్ రఘు కలిసి హత్య చేశారని మృతుడి బంధువులు శనివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీనిపై పోలీసులు వివరణ ఇస్తూ సుధాకర్ చనిపోయే సమయానికి అతిగా మద్యం సేవించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని తెలిపారు. ఎస్టేట్‌లో అతడు లారీ అన్‌లోడ్ చేసే సమయంలో ఏమి జరిగిందన్న విషయం సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైందని అంటున్నారు. వైద్యులు ఇచ్చే పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి

– ఇద్దరికి తీవ్ర గాయాలు

గంగవరం: మండలంలో శనివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గంగవరం అర్బన్ సీఐ చిన్న గోవింద్ కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం తిప్పిరెడ్డిపల్లి శాంతినగర్‌కు చెందిన యానాది సామయ్య అలియాస్ బుజ్జి(38) భార్య నుంచి విడిపోయి అక్క వద్ద ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. అతను శనివారం యర్రమచెరువు కాలనీకి చెందిన నాగరాజు(38), సోమల మండలం బోనమందకు చెందిన లక్ష్మయ్య(37)తో కలిసి పనులు చేసుకుని తిరిగి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. కల్లుపల్లి మీదుగా వెళ్లే రోడ్డు నుంచి బైపాస్ రోడ్డు దాటి వెళ్తుండగా మదనపల్లి నుంచి శాంతిపురం వెళ్తున్న కారు ఢీకొంది. సామయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ చిన్నగోవింద్ అక్కడికి చేరుకుని గాయపడిన వారిని పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కారు డ్రైవర్ రాకేష్ కిరణ్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

'ఈ సారీ నామినేషన్ వేస్తా'

- విశ్రాంత కరణం వెంకట్రామిరెడ్డి
- డిఫీటెడ్ ఎమ్మెల్యే అన్న నేమ్ బోర్డు కోసమే..

పలమనేరు : 'నేను ఈ సారి కూడా నామినేషన్ వేస్తా' అని బైరెడ్డిపల్లె మండలం చిన్నచల్లారిగుంటకు చెందిన వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఆయన వయసు 79 సంవత్సరాలు. కరణంగా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. తర్వాత ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత మూడు శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈ దఫా నాలుగోసారి నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన ఎమ్మెల్యేగా గెలవాలని పోటీ చేయడం లేదట. కారణమేంటని ప్రశ్నిస్తే తన పేరు పక్కన వెంకట్రామిరెడ్డి డిఫీటెడ్ ఎమ్మెల్యే అన్న బోర్డును ఇంటి ముందు రాయించుకోవాలని ఉందని పేర్కొన్నారు. ఆ ముచ్చట తీర్చుకోవడానికి ఈ ఎన్నికల్లో నామినేషన్ వేస్తానని, ఎన్నికల ప్రచారం కోసం సూపర్‌ఎక్సెల్ వాహనం, దానికి చిన్న మైక్ సిద్ధం చేసుకున్నానని చెప్పారు. ఇందుకోసం అనుమతి తీసుకునేందుకు పలమనేరులోని ఆర్‌డీవో కార్యాలయం వద్దకొచ్చారు. ఎవరి పిచ్చి వారికానందం అని, తన సరదా కోసం ఇలా బరిలోకి దిగే వారు ఉంటారా అని జనం అంటున్నారు.



వెంకట్రామిరెడ్డి

మహిళపై కత్తితో దాడి

- వ్యక్తి అరెస్ట్

గుడిపాల: కొళాయి వద్ద నీటిని పట్టుకునే విషయంగా ఇద్దరు మహిళల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మహిళపై కత్తితో దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని 190 రామాపురం దళితవాడకు చెందిన మేనక, సోనియా కొళాయి వద్ద నీటిని పట్టుకునే విషయంగా గొడవపడ్డారు. ఈ విషయాన్ని సోనియా తన భర్త గోవిందరాజులు(30)కు తెలిపింది. ఆగ్రహం చెందిన అతను చిల్లర దుకాణం నడుపుతున్న మేనక(30)పై కత్తితో దాడి చేశాడు. ఆమె ఎడమవైపు మెడపైన, చెంపపైన గాయాలయ్యాయి. ఆమెను కుటుంబ సభ్యులు చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గోవిందరాజులును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.



నిందితుడు గోవిందరాజులును రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు